సాక్షి
ప్రకాశం
సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



మార్కాపురంలో భారీ చోరీ

మార్కాపురంలోని ఓ ఇంట్లో 80 తులాల బంగారు ఆభరణాలు, 50 వేల నగదు అపహరణకు గురయ్యాయి.

- 8లో..



ముస్లింల హక్కుల సాధన కోసం పోరాడదాం

ప్రకాశం జిల్లా ముస్లింల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
32 /20

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కరాటేతో ఆత్మరక్షణ



పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

ఒంగోలు: స్థానిక హరిప్రియ ఫంక్షన్‌హాలులో ఆదివారం సిద్దార్థ కరాటే అకాడమీ 41వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి కరాటే పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాలన్నారు. భవిష్యత్తులో చదువుకు మార్షల్ ఆర్ట్స్ సర్టిఫికెట్లు అదనపు అర్హతను జతచేస్తాయన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి గౌరవ సలహాదారు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారిగా కరాటేను పరిచయం చేసింది నల్లూరి మోహన్‌రావే అన్నారు. వేలాది మంది కరాటే క్రీడాకారులను తయారు చేశారంటూ కొనియాడారు. చిన్నవయస్సు నుంచే శారీరక దారుఢ్యం పట్ల యువత దృష్టి సారించాలని, ఆత్మ రక్షణకు కరాటేకు మించిన గొప్ప ఆయుధం మరొకటి లేదని ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాస్ అన్నారు. ఈ పోటీల అనంతరం శ్రీప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు గెలుపొందిన విద్యార్థులకు పతకాలు, ప్రశంస పత్రాలు అందించి గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు తదితరులు హాజరయ్యారు.



నల్లూరి వెంకటేశ్వర్లు అన్నను సత్కరిస్తున్న నిర్వాహకులు


రాష్ట్ర స్థాయి పోటీలకు మార్కాపురం కబడ్డీ జట్టు



నగరికి బయలుదేరిన కబాడీ జట్టు

మార్కాపురం టౌన్: ఈనెల 27, 28, మార్చి 1 వరకు చిత్తూరు జిల్లా నగరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అండర్ 14 విభాగంలో మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల టీం శిక్షణ ముగించుకుని ఆదివారం బయలుదేరినట్లు హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పీడీలు సోమశేఖరరెడ్డి, వెంకటేశ్వర్లు నేతృత్వంలో 15 రోజుల శిక్షణ పూర్తయిందన్నారు. విజేతలుగా వస్తారని ఆశిస్తున్నట్లు ట్రైనర్స్ చెన్నయ్య, సతీష్‌కుమార్ తెలిపారు. శిక్షణ శిబిరానికి సహకరించిన వాసవీ క్లబ్, జి.కాశీనాథ్, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, గుండారెడ్డి బ్రదర్స్‌కు ధన్యవాదాలు తెలిపారు.

విద్యారంగాన్ని కాషాయీకరిస్తున్న బీజేపీ ప్రభుత్వం



ఆర్‌ఎస్‌యూ సభలో ప్రసంగిస్తున్న ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హిందుత్వ అజెండాను అమలు చేస్తూ విద్యారంగాన్ని కాషాయీకరిస్తుందని ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రారంభమైన ఆర్‌ఎస్‌యూ 8వ రాష్ట్ర మహాసభల్లో ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. విద్యారంగానికి అరకొర నిధులు కేటాయిస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరితో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల గురించి ప్రశ్నించే విద్యార్థులపై అక్రమ కేసులు బనాయిస్తుందని, ఉద్యమాలను ఉక్కుపాదాలతో అణచివేస్తుందని మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నమ్మబలికిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేడు నిరుద్యోగ యువకులకు మొండిచేయి చూపి, అదానీ అంబానీలకు ప్రయోజనం చేకూర్చేలా పాలన చేస్తున్నారని విమర్శించారు. తొలుత మహాసభల ప్రారంభ సూచికగా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వెన్నుతుర్ల రవి శంకర్ రెడ్డి ఆర్‌ఎస్‌యూ జెండాను ఎగురవేశారు. ఈ సభలో ఆకుమల్ల శ్రీధరర్, నాగరాజు, ప్రశాంత్, చందు, చరణ్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమల.. విదేశీ కిలకిల

ఒంగోలు డెస్క్

గుడ్లగూబ ఆహార్యం.. గద్దజాతి విహంగం. పంచ రంగుల పరదేశీయ పక్షులు. కాలాలను అనుసరించి ఖండాంతరాలు దాటొచ్చి విడిది చేసిపోయే అతిథులు. ఈ పక్షులు ఆహారం కోసం కీకారణ్యంలో విడిది చేస్తున్నాయి. ప్రకృతిలో ఇదో అద్భుతం. ఎక్కడ అనుకూలమైన ప్రదేశం ఉందో అక్కడకు వలస పోతుంటాయి. కాలం కలసి రాగానే రివ్వున స్వస్థలాలకు ఎగిరిపోతాయి.. వేల కిలోమీటర్లు ప్రయాణించి సువిశాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న నల్లమల అభయారణ్యానికి వచ్చి వాలిపోతున్నాయి. ఆహారం..సురక్షిత ఆవాసం కోసం విదేశీ విహంగాలు ఇక్కడకు రావడంతో నల్లమలకు సరికొత్త అందాలను దిద్దుతున్నాయి. ఈ అతిథుల విశేషాలు తెలుసుకుందాం..

- ఆహారం కోసం ఖండాంతరాలు దాటి..
- మంచు దేశాల నుంచి అభయారణ్యానికి
- శీతాకాలంలో విహంగాల సందడి
- అక్టోబర్ నుంచి మార్చి వరకు నల్లమలలోనే..
- అరుదైన విహంగాలకు శ్రీశైలం రిజర్వు ఫారెస్టు విడిది





మార్ష్ హారియర్

ఇవి ఆహారం కోసం ఎక్కువగా మైదానం, నీటి ప్రదేశాల్లో వేటసాగిస్తాయి. నీటి పక్షులతో పాటు, చిన్న చిన్న పక్షులను ఆహారంగా తింటాయి.



షార్ట్ ఇయర్డ్ ఔల్

ఇది గుడ్లగూబ జాతికి చెందిన పక్షి. చెవులు మరీ పొట్టిగా ఉండటం దీని ప్రత్యేకత. ఇవి బయటకు కనిపించవు. ఇది సెంట్రల్ యూరప్ నుంచి వలస వస్తుంది. దీని రాక కోసం పక్షి ప్రేమికులు ఎదురుచూస్తుంటారు. ఫొటోలు తీసేందుకు పోటీ పడుతుంటారు.

శీతల దేశాలైన రష్యా, లండన్, సెంట్రల్ యూరప్, కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, అజర్‌బైజాన్, నార్వే, పోలాండ్ తదితర దేశాల్లో శీతాకాలం చాలా ప్రాంతాలు మంచుతో భూమి గడ్డకట్టి పోతుంటుంది. ఆ సమయంలో అక్కడ నివాసముంటే జంతువులకు, పక్షులకు ఆహారం లభ్యం కాదు. జీవనం కూడా కష్టతరమవుతుంది. పక్షులు ఉష్ణ దేశాలకు వలస పోతుంటాయి. ఆ సమయంలో మన దేశం వాటికి అనుకూలంగా ఉంటుంది. మన రాష్ట్రంలో ప్రకాశం, గుంటూరు, కర్నూలు జిల్లాల పరిధిలో 3568 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది నల్లమల అటవీ ప్రాంతం. నల్లమలలోని శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్టులో మైదాన ప్రాంతం, నీటి లభ్యత, ఆహారం ఎక్కువగా లభిస్తుండడంతో విదేశీ అతిథులు వచ్చి వాలుతుంటాయి. చిన్న పక్షుల నుంచి పెద్ద పెద్ద పక్షులు లక్షల్లో వలస వస్తుంటాయి. ఇలా వందల సంవత్సరాల నుంచి వలస వచ్చిపోతుంటాయి. అక్టోబర్ నెల నుంచి మార్చి నెలాఖరు వరకూ ఇక్కడ ఉంటాయి. వేసవి ప్రారంభమయ్యే సమయానికి ఇవి తిరిగి వెళ్లిపోతుంటాయి. కొన్ని జాతులు ఇక్కడే ఉండిపోతుంటాయి. దాదాపు ఎనిమిది వేల నుంచి పదివేల కిలోమీటర్లు గగన తలంలో ప్రయాణించిన విహంగాలు ఇక్కడ వాలుతుంటాయి. ఇవి ఇక్కడ ఉన్న ఆరు నెలల పక్షి ప్రేమికులకు పండగే.. ఎక్కడెక్కడి నుంచో వచ్చి వీరు మంచు ఖండాల నుంచి వచ్చే పక్షులపై పరిశోధనలు చేస్తుంటారు. బయోడైవర్సిటీ శ్రీశైలం ఎఫ్ఆర్‌వో హాయత్ సైతం వీటి జీవన శైలి, ఆహారం, వేట..ఇలా అన్ని కోణాల్లో విస్తృతంగా పరిశోధనలు చేశారు. అరుదైన పక్షులను తన కెమెరాలో బంధించారు కూడా. అరుదైన ఈ పక్షులు నల్లమలకే అందాలనిస్తున్నాయి.

విదేశీ అతిథులు.. ఆహారం ఇలా..

గ్రేటర్ షార్ట్ టౌడ్ లార్క్ (చిన్న పక్షులు) వేలాదిగా వస్తాయి. ఇవి మిడతలు, చిన్న చిన్న క్రిమికీటకాలను ఆహారంగా తింటుంటాయి. గతంలో ఇవి ఎక్కువగా రోళ్లపాడుకు వచ్చేవి. అక్కడ కోట్లలో మిడతలు ఉండేవి. వాటిని తినేందుకు వేల సంఖ్యలో విదేశీ చిన్న పక్షులు వచ్చేవి. తర్వాత మిడతలు తగ్గిపోవడంతో ఇవి నల్లమలలోని మైదాన ప్రాంతాలకు వస్తున్నాయి. వీటితో పాటు గద్ద జాతికి చెందిన హారియర్స్ కూడా ఉంటాయి. వాటిల్లో పల్లిడ్ హారియర్, మార్ష్ హారియర్, మాన్‌టెగ్యూస్ హారియర్, పైడ్ హారియర్ తదితర రకాలు ఇక్కడ షెల్టర్ కోసం వస్తాయి. ఇవి మాంసాహార పక్షులు. తొండలు, ఉడతలు, చిన్నచిన్ని పక్షులను కూడా ఆహారంగా తింటుంటాయి. ఇవేకాకుండా లండన్ నుంచి చిన్న చెవుల గుడ్లగూబలు సైతం ఇక్కడకు వస్తుంటాయి. ఇక్కడ స్పాటెడ్, జంగిల్ అవుల్ తదితర 12 రకాల గుడ్ల గూబలు ఉన్నాయి.

పల్లీడ్ హారియర్



ఈ గద్ద జాతి పక్షి అంతరించిపోతోంది. దీన్ని ఉడతల గద్ద అంటారు. ఇవి రష్యా, మధ్య ఆసియా దేశాల నుంచి వలస వస్తుంటాయి. అక్టోబర్ నుంచి మార్చి వరకు నల్లమలలో ఉంటాయి. సంతానోత్పత్తి మాత్రం స్వదేశం చేరుకున్న తర్వాత చేస్తాయి. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేటర్ ఆఫ్ నేచర్ దీనిని గుర్తించింది. ఈ జాతిని కాపాడుకునేందుకు ఐసీయూఎన్ ప్రత్యేక దృష్టి సారించింది.

బ్లాక్ బాజా



ఈ పక్షిని తొలిసారి నల్లమలలో 2018లో గుర్తించారు. ఇవి చలి ప్రదేశాల నుంచి వలస వస్తుంటాయి. చిన్న కాళ్లు ఉండి..చిన్న చిన్న సమూహాలుగా ఎత్తయిన చెట్లపై నివశిస్తాయి. 30 నుంచి 35 సె.మీ పొడవు ఉంటాయి. వీటి రెక్కల వెడల్పు 66 నుంచి 80 సెం.మీ వరకు ఉంటుంది. వీటిలో మగ పక్షులకు మెడకింద తెల్లని మచ్చలు ఉంటాయి.

గ్రేటర్ షార్ట్ టోడ్ లార్క్



ఇది కూడా హారియర్స్‌తో కలిసి ఇక్కడికి వలస వస్తుంటాయి. చూడటానికి పిచ్చుకల్లా ఉండే ఈ పక్షులు లక్షల సంఖ్యలో ఇవి వస్తుంటాయి. హారియర్స్ వీటిని వేటాడి తింటాయి.

అరుదైన జాతుల గుర్తింపు...



పక్షుల సంచారానికి నల్లమలలోని శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్టు, రోళ్లపాడు ఎక్కువ అనుకూలమైన ప్రాంతాలు. పదేళ్లుగా వైల్డ్‌లైఫ్‌పై పరిశోధనలు చేస్తున్నాను. బ్లాక్ బాజా అనే అరుదైన పక్షిని 2018లో ఫొటో తీశాను. ఇది హిమాలయాల్లో ఉంటుంది. ఇది కడప ప్రాంతంలో కనిపించింది. దీనిని మన రాష్ట్రంలో ఫొటో తీసినవారు ఎవరూ లేరు. ఎన్ఎస్‌టీఆర్‌లో స్పాట్‌బిల్లీడ్ ఈగల్‌ను గుర్తించాను. అలాగే అరుదైన రాబందు లెసర్ అడ్జెటెంట్‌ను వెలుగోడు వద్ద గుర్తించి ఫొటో తీశాను. నా సహచర ఉద్యోగి మున్నా కూడా నాతో వచ్చి ఫొటోలు తీస్తుంటారు.

– మహమ్మద్ హాయత్, ఎఫ్ఆర్‌వో, బయోడైవర్సిటీ కేంద్రం, శ్రీశైలం

ఇసబెల్లిన్ వీటర్



ఇది కూడా వలస పక్షి. వలస వచ్చిన గద్దలు వీటిని వేటాడి తింటాయి. వీటిలో ఆడపక్షులు 15 సెం.మీ వరకు పొడవు ఉంటాయి. తోక భాగం నల్లగా ఉంటుంది. పైభాగం ఇసుక రంగులో (శాండీ బ్రౌన్) ఉంటుంది.

మాన్‌టెగ్యూస్ హారియర్



ఇది శీతల దేశాల నుంచి నల్లమలకు వస్తుంది. పిల్లి గద్ద రకానికి చెందింది. బూడిద రంగు శరీరం కలిగి రెక్కల కింది భాగం నల్లగా ఉంటుంది. 43 నుంచి 45 సెం.మీ పొడవు ఉంటాయి. రెక్కల వెడల్పు 97 నుంచి 115 సెం.మీ వరకు ఉంటుంది.


ఫలరాజుకి గడ్డుకాలం

ఫలరాజుగా పేరుగాంచిన మామిడి పండు ప్రస్తుతం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. పండుఈగ, టెంకపురుగు, మ్యాంగో లూఫర్స్ వంటి తెగుళ్లతో రెండేళ్ల నుంచి మామిడి తోటల్లో సమస్యలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది పూత దశలోనే తామరపురుగు వంటి తెగుళ్ల దాడి మొదలైంది. దీంతో జిల్లాలో అధిక విస్తీర్ణంలో సాగులో ఉన్న అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన ఉలవపాడు మామిడి బ్రాండ్‌పై నీలినీడలు అలుముకుంటున్నాయి. ఈ తెగుళ్లు వల్ల కాయ నాణ్యత లోపిస్తుండడంతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

- ఫలరాజుగా పేరొందిన మామిడిపై వరుసగా తెగుళ్ల దాడి
- గతేడాది పండుఈగ, టెంకపురుగు తెగుళ్లతో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- ఈ ఏడాది పూత దశ నుంచి ప్రారంభమైన తెగుళ్ల ఉధృతి
- అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ఉలవపాడు మామిడికి చేటు చేస్తున్న అంతుపట్టని తెగుళ్లు
- నాణ్యత లోపిస్తుండడంతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం
- ప్రస్తుతం 15 వేల ఎకరాలకు పైగా సాగులో ఉన్న మామిడి తోటలు



తామరపురుగు సోకిన మామిడి పూత



పండుఈగను ఎదుర్కొనేందుకు ఫ్రూట్‌కవర్స్ ఏర్పాటు



ఫ్రూట్‌కవర్ తొడిగిన కాయ నాణ్యత

కందుకూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం మండలాల్లో అత్యధికంగా మామిడి సాగులో ఉంది. ఈ ప్రాంతాల్లో దాదాపు 15 వేల ఎకరాల్లో సాగు ఉంది. వీటితో పాటు నెల్లూరు జిల్లా కావలి, వింజమూరు ప్రాంతాల్లోను మామిడి సాగు ఉంది. అయితే వీటిలో ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లోని ఇసుక నేలలు, ఎర్ర నేలల్లో పండే మామిడి ప్రత్యేకం. ఈ ప్రాంతంలో పండే కాయకు ఉండే రుచి వల్ల అంతర్జాతీయ ఖ్యాతి వచ్చింది. ఇతర దేశాలకు ఈ ప్రాంతం నుంచి ఏటా కాయలు ఎగుమతి అవుతుంటాయి. అయితే రెండు సంవత్సరాలుగా ఈ బ్రాండ్‌ను «పండు ఈగ» అనే అంతుచిక్కని తెగులు తీవ్రంగా దెబ్బకొడుతోంది. అలాగే మ్యాంగోలూఫర్స్ అనే పురుగు ఉధృతి పెరుగుతోంది. వీటి వల్ల కాయ చూడటానికి నిగనిగలాడుతూ కనిపించినా కోసి చూస్తూ లోపల పుచ్చిపోయి ఉంటుంది. ఇది గత సీజన్‌లో ఉధృతంగా కనిపించింది. దీంతో కాయ నాణ్యత లోపించి దేశ, అంతర్జాతీయ ఎగుమతులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. దీని వల్ల గతేడాది కేవలం 4 టన్నులు మాత్రమే విదేశాలకు కాయలు ఎగుమతి అయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ ఏడాది పూత దశలోనే తామరపురుగు ఉధృతి అధికంగా ఉందని ఉద్యానవనశాఖ అధికారులు చెప్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం మామిడి పూతలు పూర్తిగా పూత దశలో ఉన్నాయి. ఈ తెగులు వల్ల పూతరాలిపోతుండడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా సీజన్ ప్రారంభం నుంచే మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

పెరుగుతున్న పెట్టుబడులు:

సొంత యజమానులతో పాటు, సీజన్ వరకు తోటలను కౌలుకు తీసుకునే వారు అధికంగా ఉన్నారు. పూతరాక ముందు అయితే ఎకరాను రూ.20 వేలకు కౌలుకు తీసుకున్న రైతులు, ప్రస్తుతం రూ.50 వేల వరకు కౌలు చెల్లించి తోటలను తీసుకుంటున్నారు. దీనికి తోడు ప్రస్తుతం తెగుళ్లను ఎదుర్కొనేందుకు విపరీతంగా పురుగు మందులు పిచికారి చేయాల్సి వస్తోంది. ఇప్పటికే రూ.20 వేల వరకు ఖర్చు చేశారు. ఇక పిందె వచ్చిన తరువాత పెట్టుబడి ఖర్చులు అదనం. దీంతో తెగుళ్ల ఉధృతి వల్ల అదనపు పెట్టుబడి అవుతుంది. అయినా అవి అదుపులోకి రాని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో ఉద్యానవనశాఖ తరపున శాస్త్రవేత్తలు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి తెగుళ్ల ఉధృతిని కట్టడి చేసే చర్యలు వివరిస్తున్నారు. కాయ దశలో వచ్చే పండుఈగను అరికట్టేందుకు ఫ్రూట్‌కవర్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. రాష్ట్రం మొత్తానికి ఫ్రూట్‌టెక్ అనే కంపెనీ ఈ కవర్లు సరఫరా చేస్తున్నట్లు చెప్తున్నారు.


ఎగుమతులకు విపరీత డిమాండ్:

ఉలవపాడు మామిడికి దేశీయంతోపాటు, అంతర్జాతీయ మార్కెట్ ఉంది. ఇక్కడ పండే బంగినపల్లి రకం మామిడికి విపరీత డిమాండ్ ఉంటుంది. అయితే పండుఈగ తెగులు వల్ల గతేడాది తీవ్రంగా దెబ్బకొట్టింది. అయితే ఈ ఏడాది ఇప్పటికే ఐదుగురు అంతర్జాతీయ ఎగుమతి వ్యాపారులు ఉద్యానవన శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. యూఎస్, ఆస్ట్రేలియా, యూఏఈ, ఖతార్ వంటి దేశాలకు ఎగుమతి చేస్తామంటూ ముందుకు వచ్చారు. రోజుకు 5 టన్నుల చొప్పున ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్తున్నారు. అయితే నాణ్యత బాగుంటే డిమాండ్‌కు అనుగుణంగా రేట్లు కూడా వచ్చే అవకాశం ఉంది.

ప్రాసెసింగ్ కోసం కలెక్షన్ సెంటర్స్:

ఈ ఏడాది ఉద్యాన పంటలు సాగు చేసే రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం కలెక్షన్ సెంటర్స్‌ని నిర్మిస్తుంది. రైతులు గ్రూపులుగా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే రూ.15 లక్షల వరకు మంజూరు చేస్తుంది. దీనిలో దాదాపు రూ.11 లక్షల వరకు సబ్సిడీ రూపంలోనే పోతుంది. ఇప్పటికే ఉలవపాడు, గుడ్లూరు, వలేటివారిపాలెంలో కలెక్షన్ సెంటర్స్ నిర్మాణంలో ఉన్నాయి. 60 పొడవు, 40 వెడల్పు సైజు షెడ్డు నిర్మించడంతో పాటు, గ్రేడింగ్ టేబుల్, ట్రేలు వంటి సరఫరా చేస్తారు. కాయలను పూర్తిగా గ్రేడింగ్ చేసుకుని క్వాలిటీ ఆధారంగా వేరు చేసుకునే అవకాశం ఈ కేంద్రాల వల్ల కలుగుతుంది. దీని టన్నుకి అధిక రేటు వస్తుందని భావిస్తున్నారు.

తెగుళ్ల ఉధృతి అధికంగానే ఉంది



ప్రస్తుతం మామిడిలో తెగుళ్ల ఉధృతి అధికంగానే ఉంది. వీటిని ఎదుర్కొనేందుకు రైతులకు అనేక అవగాహన సదస్సులు, ప్రత్యామ్నాయ పద్ధతులు సూచిస్తున్నాం. ఏప్రిల్ నుంచి మార్కెట్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్ ఈ ఏడాది బాగా ఉంది. రైతులు కాయలను ప్రాసెసింగ్ చేసుకుంటే మంచి ధరలు వస్తాయి.

– బ్రహ్మసాయి, ఉద్యావనశాఖ అధికారి

శ్రీశైలం దేవస్థానానికి బ్యాటరీ వాహనం వితరణ



వాహన ప్రారంభోత్సవంలో పాల్గొన్న కనకదుర్గ, మంత్రి సురేష్, ఎమ్మెల్యే శిల్పా

మార్కాపురం: శ్రీశైల దేవస్థానానికి ఆలయ ధర్మకర్త, పట్టణ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ డాక్టర్ కనకదుర్గ బ్యాటరీ వాహనాన్ని ఆదివారం అందజేశారు. ఆదివారం ఆమె మార్కాపురంలో విలేకరులకు వివరాలు తెలిపారు. సుమారు రూ.6 లక్షల విలువచేసే బ్యాటరీ వాహనాన్ని సొంత నిధులతో కొనుగోలు చేశానని, దర్శనం కోసం వచ్చే వృద్ధులు నడవలేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఈ వాహనాన్ని అందించానని చెప్పారు. ఈ వాహనం శ్రీశైలంలోని నంది సెంటర్ నుంచి డొనేషన్ కౌంటర్ వరకు ప్రయాణికులను తీసుకెళ్తుందన్నారు. ఒక్కసారి చార్జి చేస్తే 70 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని చెప్పారు. మంత్రి ఆదిమూలపు సురేష్, ఆలయ చైర్మన్ చక్రపాణిరెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఈవో లవన్నల సమక్షంలో ప్రారంభించి దేవస్థానానికి అప్పగించినట్లు తెలిపారు.

మాదిగల పక్షాన సీఎం జగన్

- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ డైరెక్టర్ విజయకుమార్, జేసీఎస్ కన్వీనర్ సుధాకర్



సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న విజయ్‌కుమార్, సుధాకర్

చీమకుర్తి: రాజ్యాంగ పదవుల్లో మాదిగలకు పెద్దపీట వేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిగల పక్షాన నిలిచారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ డైరెక్టర్ కొలకలూరి విజయకుమార్, జేసీఎస్ కన్వీనర్ కొమ్ము సుధాకర్ అన్నారు. ఆదివారం ఒంగోలులోని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కార్యాలయంలో వారు మాట్లాడారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో అమలాపురం నుంచి మాదిగ సామాజికవర్గానికి చెందిన బొమ్మి ఇస్రాయేల్‌కు అవకాశం ఇవ్వడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హోం మంత్రిగా తానేటి వనిత, పట్టణాభివృద్ధి శాఖామంత్రిగా ఆదిమూలపు సురేష్, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్, మరో ఎమ్మెల్సీ అభ్యర్థిగా డొక్కా మాణిక్యవరప్రసాద్‌కు అవకాశం ఇచ్చి మాదిగల పక్షాన ఉన్నానని నిరూపించారన్నారు. గత పాలకులు మాదిగలను ఓటు బ్యాంకుగానే చూశారే తప్ప రాజ్యాంగ పదవులను కట్టబెట్టింది లేదని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో మాదిగలంతా వైఎస్సార్ సీపీ తరపున నిలబడతారని, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసేందుకు మాదిగలంతా కంకణం కట్టుకున్నారని వారు తెలిపారు.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం

మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత ఆమలక లక్ష్మీనారాయణ దేవాలయంలో 60వ సప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, 9 గంటలకు ధ్వజారోహణం నిర్వహించి గరుడ ప్రసాదం పంపిణీ చేశారు. కల్యాణంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలుగా వి.మల్లికార్జునరావు, జీవీ శ్రీచరణ్ దంపతులు వ్యవహరించారు. కమిటీ అధ్యక్షులు డీవీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.చెంచయ్య, కోశాధికారి వై.వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు, మహిళ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి మృతి


పట్టాల మీదపడి ఉన్న మృతదేహం

తర్లుపాడు: రైలు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు..మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామానికి చెందిన బొగ్గు లక్ష్మీరెడ్డి(65) ఆదివారం ఉదయం తర్లుపాడు స్టేషన్‌లో రైలు కిందపడి మృతి చెందినట్లు సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే ప్రమాదం వల్ల జరిగిందా..ఆత్మహత్య చేసుకున్నాడా అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని జేబులోని ఆధార్‌కార్డు ఆధారంగా పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు.

చెరువులో యువకుడి మృతదేహం


చెరువులో యువకుని మృతదేహం

గుడ్లూరు: చెరువులో గుర్తు తెలియని యువకుడు మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన మండలంలోని చేవూరులో ఆదివారం వెలుగులోకి వచ్చింది, వివరాల్లోకి వెళితే.. చేవూరు గ్రామంలో ఉన్న చెరువులో జాతీయ రహదారి వైపు యువకుని మృతదేహం నీటిలో తెలియాడుతుండటంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రసాదరెడ్డి సిబ్బందితో కలిసి చెరువు వద్దకు వెళ్లి నీటిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. యువకుని మృతదేహం ఉబ్బి ఉండటంతో గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉంది. మూడు రోజులు క్రితం చెరువులో పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడికి సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. మృతుడు ఒంటి మీద నలుపు రంగు టీ షర్టు, మోకాళ్ల వరకు షార్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పట్టపగలే దొంగల హల్‌చల్



మద్దిపూడి: మద్దిపూడిలో పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. ఊరికి వెళ్లిన ఇళ్లు, బతుకుదెరువు నిమిత్తం వలస వెళ్లిన ఇళ్లు, కూలీ పనుల నిమిత్తం పొలం వెళ్లిన గృహాలను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. మద్దిపూడికి చెందిన మండే గౌరమ్మ కూలి పనుల నిమిత్తం పొలం వెళ్లింది. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులకొట్టి ఇంట్లో ఉన్న రూ. 8వేలు నగదు, కమ్మలు అపహరించారు. అలాగే వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో నివాసముంటున్న టిఉలిగయ్య ఇంటి తాళాలు పగులకొట్టి రూ. 34 వేల నగదు, 3 ఉంగరాలు చోరీ చేశారు. అలాగే ఉప్పు వెంకటలక్ష్మి, ఓర్సు జమున ఇళ్ల తాళాలు గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి ఇంట్లో ఉన్న ప్రాంశరీ నోట్లు, ఇంటి కాగితాలు చించి వేసినట్లు తెలిపారు. అలాగే గాలేటి వెంకటనారాయణ ఊరికి వెళ్లి..ఆదివారం వచ్చి చూడగా..ఇంటి తాళాలు పగులగొట్టేందుకు విఫలయత్నం చేసినట్లు గుర్తించారు. పట్టపగలే దొంగలు రెచ్చిపోతుండటంతో గ్రామస్తులు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి.

టైలర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం

- వైఎస్సార్ హయాంలో జీవో నంబర్ 86 ద్వారా టైలర్ల అభివృద్ధికి శ్రీకారం
- అనంతరం నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు
- ప్రస్తుతం పేద దర్జీలకు రూ.10 వేల ఆర్థికసాయం అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- సమీక్షలో ఏపీ టైలర్ల సంక్షేమ బోర్డు చైర్మన్ షేక్ సుభాన్‌బీ


మాట్లాడుతున్న ఏపీ టైలర్ల సంక్షేమ బోర్డు చైర్మన్ సుభాన్‌బీ

ఒంగోలు: కరోనా కారణంగా మూడేళ్లుగా టైలర్ల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించుకోలేకపోయామని, ఈ నేపథ్యంలో ఈ నెల 28వ తేదీ కుట్టుమిషన్ కనిపెట్టిన విలియం హోవే జయంతిని పురస్కరించుకుని టైలర్ల సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఏపీ టైలర్ల సంక్షేమ బోర్డు చైర్మన్ షేక్ సుభాన్‌బీ తెలిపారు. టైలర్ల సంక్షేమ దినోత్సవ ఏర్పాట్లకు సంబంధించి జిల్లాలోని టైలర్ల సంఘ ప్రతినిధులతో స్థానిక ఖాశిం బిల్డింగ్‌లో ఆదివారం సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏటా 2 వేల మందికిపైగా టైలర్లు ఈ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకునేవారన్నారు. కానీ, కరోనా కారణంగా ఆటంకం కలిగిందని, దర్జీలకు కనీస కూలి కూడా దక్కక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో టైలర్లకు సంబంధించి ఒంగోలులో కూడా సంఘ భవనం ఉంటే బాగుంటుందని ఇటీవల ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో చర్చించగా, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలోనే భూమి కూడా లభ్యమవుతుందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టైలర్ల ఫెడరేషన్ ఏర్పాటుకు జీవో నంబర్ 86 జారీ చేశారని సుభాన్‌బీ గుర్తుచేశారు. ఆయన మరణం తర్వాత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయన్నారు. తాజాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు కార్యక్రమం ద్వారా టైలర్లకు అండగా నిలిచారని తెలిపారు. అందుకు తామంతా ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే బాలినేనికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామన్నారు. టైలర్ల షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కుట్టు పరిశ్రమను ఆదుకునేందుకు ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్లను జిల్లాకొకటి ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. ఏపీ టైలర్ల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కానుగుల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏపీ టైలర్ల సంక్షేమ బోర్డుతో పాటు చైర్మన్, సభ్యులను ముఖ్యమంత్రి నియమించడంపై ఆనందం వ్యక్తం చేశారు. షాపుల్లో పనిచేసే వారిని కూడా జగనన్న చేదోడు పథకంలోకి తీసుకురావాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో 11 లక్షల మంది దర్జీలు ఉన్నారని, వీరందరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఏప్రిల్‌లో రాష్ట్ర మహాసభలను ఒంగోలులో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దర్జీల సంక్షేమం కోసం వెయ్యి కోట్ల రూపాయల బడ్జెట్ ప్రత్యేకంగా కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ నెల 28న స్థానిక పద్మావతి ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న టైలర్ల దినోత్సవానికి జిల్లాలోని టైలర్లంతా తరలివచ్చి జయప్రదం చేయాలని సంఘ జిల్లా అధ్యక్షుడు బడితెల నాగేశ్వరరావు, ఒంగోలు నగర అధ్యక్షుడు సుభాన్ పిలుపునిచ్చారు.

మార్కాపురంలో భారీ చోరీ


చోరీ జరిగిన గృహం


ఆధారాలు సేకరిస్తున్న సీఐ

- 80 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరణ
- క్లూస్ టీం దర్యాప్తు

మార్కాపురం: పట్టణంలో భారీ దొంగతనం జరిగింది. వస్త్రదుకాణం నిర్వహించే కె.గురువర్దన్ ఇంట్లో 80 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరణకు గురయ్యాయి. గురువర్దన్ వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం ప్రొద్దుటూరు వెళ్లాడు. భార్య రాత్రి 9 గంటల సమయంలో తాళం వేసి ఇంటి పైఅంతస్తులోని గదిలో నిద్రపోయింది. ఆదివారం ఉదయం నిద్రలేచి కిందకు రాగా తాళాలు పగలగొట్టి బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న 80 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చోరీ జరిగిన ఇంటిని డీఎస్పీ కిషోర్‌కుమార్, సీఐ భీమానాయక్, ఎస్సై శశికుమార్ సందర్శించి క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. మిద్దెపై నుంచి దొంగలు ఇంట్లోకి దిగి తాళాలు పగలగొట్టారని భావిస్తున్నారు. కాగా, పక్కనే ఉన్న మోదాల సునీల్ షాపులో కూడా దొంగలుపడి రూ.10 వేల నగదు తీసుకెళ్లారు. మెయిన్ బజార్‌లోనూ దొంగతనం జరగడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. తన కూతురు వివాహం నిమిత్తం ఇటీవలే బంగారం కొనుగోలు చేసినట్లు గురువర్దన్ తెలిపారు. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైద్యం కోసం ఎదురు చూపులు

- క్షతగాత్రుని బంధువుల విజ్ఞప్తి
- ఒంగోలులో చికిత్స పొందుతున్న బాధితుడు


తీవ్రంగా గాయపడిన సుబ్బయ్యకు వైద్యచికిత్స అందిస్తున్న దృశ్యం

కొమరోలు : మండలంలోని సర్విరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మైలగాని నడిపి సుబ్బయ్య ఇటీవల బేస్తవారపేట వద్ద రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో కోమాలోకి వెళ్ళాడు. ఒంగోలులోని ఓ కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుడు నడిపి సుబ్బయ్య గొర్రెలు కాచుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వైద్యచికిత్స నిమిత్తం దాదాపు 6లక్షల రూపాయలు అవసరం కావడంతో కుటుంబ సభ్యులు సామాజిక మాధ్యమాల ద్వారా ఆర్థిక సహాయం చేయాని విజ్ఞప్తి చేశారు. దీంతో సుబ్బయ్యకు దాదాపు లక్ష రూపాయల నగదు సమకూరింది. ఆర్థిక సహాయం చేయదలచిన వారు ఫోన్‌పే, గూగుల్ పే నెంబరు 9908886794కు పంపాలని కోరారు.

ముస్లింల హక్కుల సాధన కోసం పోరాడదాం



మాట్లాడుతున్న ముస్లిం సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రఫి

ఒంగోలు టౌన్: సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనకబాటుకు గురైన ముస్లింల రాజ్యాంగపరమైన హక్కుల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా కలిసి పోరాడదామని ముస్లిం సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫి పిలుపునిచ్చారు. స్థానిక పద్మావతి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ప్రకాశం జిల్లా ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని రంగాల్లో ముస్లింల అభివృద్ధి కోసం సంఘం పాటుపడుతోందన్నారు. ముస్లిం సమాజానికి ఎలాంటి సమస్య ఎదురైనా అండగా నిలుస్తామని చెప్పారు. రాజకీయ పార్టీలు ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణిస్తున్నాయని, రాజకీయ, సామాజిక ఎదుగుదలకు తోడ్పాటు అందించడం లేదని విమర్శించారు. చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించకుండా నామమాత్రపు సీట్లు కేటాయించడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ షంషేర్ అహమద్ మాట్లాడుతూ రాష్ట్రంలో నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు, 11 కార్పొరేషన్ల చైర్మన్లుగా ముస్లింలకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఒక ముస్లిం నాయకుడిని డిప్యూటీ సీఎంగా నియమించడం జరిగిందన్నారు. ముస్లింలు ఉన్నత విద్యనభ్యసించడం ద్వారా మాత్రమే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించగలరని స్పష్టం చేశారు. సచార్ కమిటీ నివేదిక ప్రకారం ముస్లింలు ఎస్సీ, ఎస్టీల కంటే వెనకబడి ఉన్నారన్నారు. ఆ నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకుండా తుంగలో తొక్కడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి సమస్య వచ్చినా రాజకీయాలకతీతంగా ముస్లింలు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సైదా మాట్లాడుతూ అంబేడ్కర్ అడుగుజాడల్లో రాజ్యాధికారం కోసం ముస్లింలు పోరాడాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవ చేసిన ముస్లిం నాయకులను ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా కమిటీకి ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు షేక్ రఫి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీర్‌సాబాబు, డాక్టర్ సయ్యద్ బాషా, షేక్ కరీమున్నీసా, సయ్యద్ అజీజ్, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా


ప్రమాదానికి గురైన కారు

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు మోపెడ్‌ను కారు ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందగా యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలో జాతీయ రహదారిపై పెరల్ డిస్టిలరీ కంపెనీ ఎదురుగా ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు గ్రామానికి చెందిన జామకాయల వ్యాపారి నైనాల సుబ్బారావు(60), కందుకూరు మండలం మాచవరం గ్రామానికి చెందిన అతని మనవడు ఈదుపల్లి సాయిలు ఇద్దరు మోపెడ్‌పై జామకాయలు తీసుకుని ఇనమనమెళ్లూరు నుంచి వస్తున్నారు. పెరల్ డిస్టిలరీ కంపెనీలో పనిచేస్తున్న సాయి తండ్రిని చూడటానికి వచ్చే క్రమంలో ఫ్యాక్టరీ ఎదురుగా క్రాసింగ్‌ను దాటే ప్రయత్నంలో బెంగళూరు నుంచి విజయవాడ వెళ్లేందుకు వేగంగా వస్తున్న కారు మోపెడ్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో కారుముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదంలో సుబ్బారావు రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందగా సాయికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాయిని వైద్యం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. కానిస్టేబుళ్లు శశిధర్‌రెడ్డి, సుమన్ పాల్గొన్నారు.

దంపతులకు తీవ్రగాయాలు


కంభం ప్రభుత్వ వైద్యశాలలో దంపతులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు


ప్రమాదంలో గాయపడిన మధు, కీర్తి

– 108లో చికిత్సకు తరలించి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు

బేస్తవారిపేట: ఒంగోలు–నంద్యాల హైవేపై బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు సమీపంలో ఓ మోటార్ సైకిల్ గేదెలను ఢీకొట్టింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న నంద్యాల జిల్లా రుద్రవరానికి చెందిన భార్యాభర్తలు మధు, కీర్తికి తీవ్రగాయాలయ్యాయి. దోర్నాల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, పూసలపాడు సమీపంలో గేదెలు అడ్డురావడంతో మోటార్ సైకిల్ గేదెలను ఢీకొని బోల్తాపడింది. అదే సమయంలో గిద్దలూరు నుంచి బేస్తవారిపేట వైపు వెళ్తున్న స్థానిక ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు తీవ్ర గాయాలైన దంపతులిద్దరినీ 108లో ఆస్పత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం కంభం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి దంపతులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన కారు

- పది గొర్రెలు మృతి


మృతి చెంది రోడ్డు వెంబడి పడి ఉన్న గొర్రెలు

ప్రత్తిపాడు: వేగంగా వెళుతున్న కారు గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ఘటన వేకువజామున పాత మద్రాసు రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ఒంగోలు మండలం చింతాయపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు జీవాల కాపరులు తమ గొర్రెల మందను తీసుకుని కొద్దిరోజుల కిందట గుంటూరు జిల్లాకు వచ్చారు. కొండలు, అటవీ ప్రాంతాల్లో మేపుకుని తిరిగి శనివారం రాత్రి తమ ప్రాంతానికి తోలుకుని వెళుతున్నారు. తెల్లవారుజామున సుమారు మూడు గంటల సమయంలో పెదనందిపాడు వైపు నుంచి వస్తున్న కారు ప్రత్తిపాడు శివారులో మందపైకి దూసుకొచ్చింది. దీంతో 10 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఆరింటికి తీవ్ర గాయాలపాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. మేకల కాపరులతో మాట్లాడారు. కారు నడుపుతున్న కాకుమాను మండలం అప్పాపురం గ్రామానికి చెందిన సాదరబోయిన తిరుమలరావుతో పాటు వెంట ఉన్న కద్దా కనకయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించారు. ఈ మేరకు జీవాల కాపరి వడ్లమూడి గోపి ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసాడు.

అడవి పందులు ఢీకొని యువకుడు మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీరాములు

గుడ్లూరు: బైక్‌ను అడవి పందులు ఢీకొనడంతో యువకుడు రోడ్డుపై పడి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గుడ్లూరు–పెద్దపవని ప్రధాన రహదారిలో చినలాటరఫి–నరసాపురం గ్రామాల మధ్య ఆదివారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. చినలాటరఫి గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన కొమరిగిరి శ్రీరాములు జీవనోపాధి నిమిత్తం పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి మండలంలోని జమ్ములపాలెంలో ఇటుకల బట్టీల వద్ద భార్యతో కలిసి పనిచేసుకుంటున్నాడు. శ్రీరాములు చినలాటరఫిలో ఉన్న తల్లి అంకమ్మను కుటుంబ సభ్యులను చూడటానికి ఆదివారం రాత్రి జమ్ములపాలెం నుంచి తన బైక్‌పై బయలుదేరాడు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో నరసాపురం దాటి కొంచెం ముందుకు రాగానే అడవిలో నుంచి అడవి పందులు రోడ్డు దాటడానికి ఒక్కసారిగా రోడ్డు మీదకు వచ్చి బైక్‌ను ఢీకొట్టాయి. దీంతో శ్రీరాములు రోడ్డుపై ముందుకు పడి పోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో రహదారిపై వాహనాలు ఏం రాకపోవడంతో 5 గంటలు వరకు అక్కడే ఉన్నాడు. 5 గంటలు తరువాత పొలాల్లోకి వెళుతున్న రైతులు రోడ్డుపై పడి ఉన్న యువకుడిని చూసి గ్రామానికి చెందిన శ్రీరాములుగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని 108లో కావలికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీరాములు(34)మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. ఎస్సై ప్రసాదరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం


కాలిపోయిన గృహాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారి రంగయ్య

గిద్దలూరు రూరల్: విద్యుత్ షాక్ సర్క్యూట్ వల్ల రెండు ప్రదేశాల్లో నష్టం వాటిల్లిన సంఘటన గిద్దలూరు పట్టణంలో, మండలంలోని కొంగలవీడులో ఆదివారం జరిగింది. అందిన వివరాల ప్రకారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా రేకుల షెడ్డులో నివాసం ఉంటున్న జిల్లెల లీలావతికి చెందిన నివాస గృహంలో షార్ట్ సర్క్యూట్ సంభవించి ఇంట్లోని గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. రూ. 1 లక్షకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. కొంగలవీడు గ్రామంలోని సూర పాండురంగారెడ్డి, స్వామిరంగారెడ్డి, శ్రీనివాసరెడ్డికి చెందిన నాలుగు ట్రాక్టర్ల వరిగడ్డి వాము విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయాయి.

13 మంది జూదరుల అరెస్టు

ఒంగోలు: పేకాటాడుతున్న 13 మందిని ఒంగోలు తాలూకా పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. స్థానిక చెరువుకొమ్ముపాలెం శివారులో పేకాటాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో తాలూకా ఎస్సై సురేష్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాటాడుతున్న 13 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని వారి వద్ద నుంచి రూ.20,100 సీజ్ చేశారు.